సాక్షి
హనుమకొండ

శనివారం | 21 | డిసెంబర్ | 2024



నిర్వహణాధికారులు ఎక్కడ?

మేడారంలో కార్యనిర్వహణాధికారి కార్యాలయం లేకపోవడంతో అధికారులు చుట్టపు చూపుగా వస్తున్నారని ఆదివాసీ పూజారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. - 8లో▸



టీజీబీగా ఏపీజీవీబీ బ్రాంచ్‌లు

రాష్ట్రంలోని ఏపీజీవీబీలు ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకులు (టీజీబీ)గా సేవలు అందించనున్నట్లు చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$30^0/17^0$

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగ మంచు కురుస్తుంది. .

న్యూస్‌రీల్

నిట్‌లో క్రిస్మస్ వేడుకలు



కాజీపేట అర్బన్: నిట్ క్యాంపస్‌లో శుక్రవారం నిట్‌మాస్–24 పేరిట క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిట్ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఐఐటీ రూర్కీ ప్రొఫెసర్ పీఎస్.చానీ పాల్గొని మాట్లాడారు. ఏసు క్రీస్తు బోధనలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. ఏసు ప్రభు బోధనలు, ఆటపాటలతో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ రిలేషన్ అండ్ అల్యూమ్ని అఫైర్స్ డీన్, ప్రొఫెసర్ శ్రీనివాసరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



హసన్‌పర్తి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. నగరంలోని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న 'టెక్-క్వెస్ట్–24' వేడుకల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులు ఫొటో ఎగ్జిబిట్స్, పోస్టర్లను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆవిష్కరణలు అద్భుతంగా ఉన్నాయని, వారిలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయాలని చెప్పారు. ఈ సందర్భంగా నార్కొటిక్ తెలంగాణ కంట్రోల్ బ్యూరో ఆధ్వర్యాన ఎంపవర్డ్ యూత్, డ్రగ్స్, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. అంతకు ముందు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్ రావు, ట్రెయినీ ఐపీఎస్ మన్నాన్ భట్, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



హన్మకొండ: ఇష్ట దైవాల దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. వరంగల్–2 డిపో ద్వారా భక్తులతో అరుణాచలం వెళ్తున్న ఆర్టీసీ ప్రత్యేక బస్సును హనుమకొండ బస్ స్టేషన్‌లో ఆర్‌ఎం డి.విజయ భాను శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. భక్తుల కోరిక మేరకు ప్రత్యేక బస్సులు సమకూరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ కేశరాజు భానుకిరణ్, డిపో మేనేజర్ జ్యోత్స్న, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీలో మర్యాద దినోత్సవం

హన్మకొండ: హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్‌లో శుక్రవారం మర్యాద దినోత్సవం నిర్వహించారు. మహిళా ప్రయాణికురాలిని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను సన్మానించారు. ఈసందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు ప్రయాణికుల పట్ల మర్యాదగా ఉండాలన్నారు. ప్రయాణికులను సంస్థ గౌరవిస్తోందని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఆపరేషన్ కేశరాజు భానుకిరణ్, వరంగల్–2 డిపో మేనేజర్ జ్యోత్స్న, వరంగల్–1 డిపో అసిస్టెంట్ మేనేజర్ సంతోశ్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులర్ కోర్సులుగా మార్చేందుకు కృషి : వీసీ

కేయూ క్యాంపస్: కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలోని ఎస్‌ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చేందుకు కృషి చేస్తానని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలను శుక్రవారం సందర్శించిన వీసీ.. తరగతుల గదుల్లోకి వెళ్లి పరిశీలించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షాలుతో మాట్లాడగా.. కళాశాలకు ఇంకా అధ్యాపకులు అవసరమని, ల్యాబ్ సదుపాయాలతోపాటు మౌలిక వసతులు కల్పించాలని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కళాశాల ఆవరణలో వీసీ మొక్క నాటారు. ఆయన వెంట రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉన్నారు. అనంతరం ఎస్‌డీఎల్‌సీఈని రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వీసీ సందర్శించి డైరెక్టర్ రాంచంద్రంతో మాట్లాడారు.

బకాయిల మోత



గ్రేటర్‌లో రూ.56.95 కోట్ల నల్లా బకాయిలు

నిద్ర మత్తులో అధికార యంత్రాంగం

వరంగల్ అర్బన్: నల్లా, ఆస్తి పన్నుల వసూళ్లలో గ్రేటర్ వరంగల్ అధికార యంత్రాంగం అలక్ష్యం ప్రదర్శిస్తోంది. ఏటేటా పేరుకుపోతున్న నల్లా, ఆస్తి పన్నుల బకాయిలు పెరిగిపోతున్నప్పటికీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు ఆఫీసర్లు తమకేమీ పట్టదన్నట్లుగా చూస్తున్నారు. నాలుగేళ్లుగా పాత బకాయిలు (ఎరియర్స్) కోట్లల్లో పేరుకుపోయాయి. గ్రేటర్ వరంగల్ పాలక వర్గం పెద్దలు, ఉన్నతాధికారులు కూడా ఈ బకాయిలపై నోరుమెదకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పాత బకాయిలు రూ.38 కోట్లు

కొన్నేళ్లుగా నల్లా పాత బకాయిలు ఏళ్ల తరబడిగా పేరుకుపోతున్నాయి. మొత్తం రూ.41.55 కోట్లు బకాయిలు ఉండగా.. ఈ ఏడాది రూ.3.54 కోట్లు వసూలు చేశారు. ఇంకా.. రూ.38.01 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. పాత, కొత్త బకాయిలు మొత్తం రానున్న మూడు నెలల్లో రూ. 56.95 కోట్లు రాబట్టాల్సి ఉంది.

బాధ్యతారాహిత్యం

నగరంలో తాగునీటి సరఫరా బాధ్యత ఇంజినీర్లదే. కొత్త నల్లా కనెక్షన్లు మంజూరు చేసి, కనెక్షన్ ఇస్తారు. అయితే పన్నులు వసూలు చేసే బాధ్యత బల్దియా విభాగానికి ఉందా?. దీంతోనే అసలు సమస్య వస్తోంది. నల్లా నీళ్లు రావడం లేదని ప్రజలు పన్ను కట్టేందుకు ఇష్టపడడం లేదని ఆర్‌ఐలు చెబుతున్నారు. ఈ కారణంగా ఏటేటా బకాయిలు పేరుకుపోతున్నాయి ఆస్తి, నీటి పన్నులను కలిపి డిమాండ్ నోటీసు జారీ చేస్తున్నారు. కానీ ఇంటి పన్ను వసూలుపై పెడుతున్న చొరవ నల్లా సొమ్ము వసూలు చేయడంపై పెట్టడం లేదు. ఏఈ, డీఈలు, ఈఈలు, చివరకు ఎస్ఈ స్థాయి అధికారి వరకు బకాయిలపై దృష్టిసారించడం లేదు.

కేవలం 14.84 శాతం వసూలు

నగర ప్రజలకు తాగునీరందించడం బల్దియాకు రోజు రోజుకూ భారమవుతోంది. జనాభా 12 లక్షలకు చేరింది. నల్లా కనెక్షన్ల సంఖ్య 1,77,804 ఉన్నాయి. తాగునీటి సరఫరా కోసం ఏడాదికి రూ. 30 కోట్ల మేర ఖర్చు చేస్తోంది. డిమాండ్ మాత్రం రూ.25.32 కోట్లు ఉంది. అందులో కేవలం రూ.12 కోట్ల నుంచి 14 కోట్లు దాటడం లేదు. 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 9 నెలలు పూర్తి కావాల్సి వస్తోంది. ఇప్పటి వరకు రూ.6.38 కోట్లు మాత్రమే వసూలు చేశారు.



ఎల్కతుర్తి ఎస్సైపై సస్పెన్షన్ వేటు

- అవినీతి, అక్రమ వసూళ్లే కారణం..?
- రాజ్‌కుమార్‌పై డీజీపీ, సీపీలకు ఫిర్యాదులు.. విచారణ
- ఆ తర్వాతే నిర్ణయం తీసుకున్న అధికారులు



ఎస్సై రాజ్‌కుమార్

సాక్షిప్రతినిధి, వరంగల్:

ప్రజా సమస్యలపై దృష్టి సారించి వారిచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాల్సిన ఎల్కతుర్తి ఎస్సై గోదారి రాజ్‌కుమార్ అక్రమమార్గం పట్టడంతో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం అతడిపై సస్పెన్షన్ వేటు వేశారు. రాజ్‌కుమార్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు అవినీతి, అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో విచారణ చేపట్టిన పోలీస్ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. సుమారు 23 ఏళ్ల క్రితం ఎస్సై వి.వి.గిరి అక్రమంగా వసూలు చేసిన డబ్బులను ఓ హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదుతో అప్పటి డీఎస్పీ ప్రభాకర్‌రావు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని సస్పెండ్ చేశారు. ఆ తర్వాత ఎల్కతుర్తిలో రాజ్‌కుమార్ ఆ తరహా ఆరోపణలపైన సస్పెండ్ కావడం చర్చగా మారింది.

అధికార పార్టీ నేతలతో చెట్టాపట్టాల్..

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎస్సై బాధ్యతలు చేపట్టిన రాజ్‌కుమార్.. ఎల్కతుర్తి మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నేతలను రెండు గ్రూపులుగా విభజించి పబ్బం గడుపుకున్నారన్న విమర్శలున్నాయి. ఈక్రమంలో ఓ కీలక ప్రజాప్రతినిధి సోదరుడి కుమారుడితో చెట్టాపట్టాలేసుకుని తిరగడం.. ఆయన ఎల్కతుర్తి మండలానికి వస్తే మంత్రి, ఎమ్మెల్యే తరహాలో కాన్వాయ్‌ని సమకూర్చడం అప్పట్లో వివాదాస్పదమైంది. స్వయంగా ఆయన సోదరుడి వివాహానికి అధికార పార్టీకి చెందిన ఒక వర్గం వారిని మాత్రమే పిలిచి రాత్రి వరకు దావత్‌లిచ్చిన సదరు ఎస్సై.. మరో వర్గాన్ని పట్టించుకోలేదన్న అక్కసు కొందరిలో ఉంది. ఇదిలా ఉంటే ఎల్కతుర్తి మండల పరిధి ఓ గ్రామానికి చెందిన భూతగాదా విషయంలో నిర్లక్ష్యం వహించడమే కాకుండా స్టేషన్ చుట్టూ తిప్పుకుంటూ ముప్పు తిప్పలు పెట్టాడని సమాచారం. ఈ నేపథ్యంలో బాధితులు డీజీపీ, వరంగల్ సీపీకి సైతం ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు శుక్రవారం సస్పెండ్ చేయడంపై చర్చ జరుగుతోంది.

తప్పిదాలు అనేకం..

సస్పెన్షన్‌కు గురైన ఎస్సై రాజ్‌కుమార్ చేసిన తప్పిదాలు అనేకం ఉన్నాయి. ఫిర్యాదుదారుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించుకోవాలని ఉచిత సలహాలు ఇస్తూ చివరకు న్యాయం చేయలేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికార పార్టీకి చెందిన ఆ కీలక ప్రజాప్రతినిధి సోదరుడి కుమారుడితో ఉన్న సంబంధాల కారణంగా సాధారణ పౌరులు ఇచ్చిన ఫిర్యాదులు అసలే పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఆయన అండతో విధుల పట్ల అలసత్వం, నిర్లక్ష్యం వహించాడని, సదరు కీలక ప్రజాప్రతినిధి సోదరుడి కొడుకు పుట్టినరోజు వేడుకల్లో ఎస్సై సైతం పాల్గొని విందు చేసుకోవడం కూడా ఈ సందర్భంగా చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే.. ఇసుక, పీడీఎస్ రైస్, గ్రానైట్ పరిశ్రమల నుంచి పెద్ద మొత్తంలో మామూళ్ల వసూలు చేసినట్లు వచ్చిన ఫిర్యాదులు కీలకంగా మారాయి. అలాగే అనుమతి లేకుండానే ఇటీవల కరీంనగర్‌లో జరిగిన అధికారపార్టీ కీలక ప్రజాప్రతినిధి బంధువు బర్త్‌డే వేడుకల్లో సంబరాలు చేసిన వీడియోలు, ఫొటోలు వైరల్ కావడం వివాదాస్పదంగా మారాయి. సుమారు ఏడాదిన్నరగా ఎల్కతుర్తిలో ఎస్సైగా పని చేస్తున్న రాజ్‌కుమార్ ఇంతకు ముందు హనుమకొండ ఎస్సైగా పనిచేసినపుడు కూడా ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయి.







ఉత్సాహంగా సీఎం కప్ పోటీలు

హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సీఎం కప్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శుక్రవారం జిమ్నాస్టిక్ పోటీల్లో బాలబాలికలు నువ్వా నేనా అన్నట్టు ప్రదర్శనలతో పోటీపడ్డారు. - సాక్షి, ఫొటోగ్రాఫర్ వరంగల్

నవంబర్ 19న వరంగల్ జిల్లా దుగ్గొండి మండల పరిధి ఓ గ్రామంలో 16 ఏళ్ల అమ్మాయి, 25 ఏళ్ల అబ్బాయికి వివాహం అవుతున్నట్లు ఫోన్ రావడంతో జిల్లా బాలల సంరక్షణ అధికారులు వెళ్లి పెళ్లి ఆపారు. తర్వాత అమ్మాయిని సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచి నర్సంపేటలోని ఆశ్రమ పాఠశాలకు తరలించారు. అక్కడ రెండు రోజులున్న తర్వాత అమ్మాయిని తల్లిదండ్రులు తీసుకెళ్లారు.

ఈనెల 5న వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని ఓ గ్రామంలో 16 ఏళ్ల బాలికకు వరుసకు మేనబావ అయిన 28 ఏళ్ల యువకుడితో వివాహం చేస్తున్నట్లు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం వచ్చింది. జిల్లా బాలల సంరక్షణ విభాగాధికారులు బాలికను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచారు. తర్వాత ఆమె తల్లిదండ్రులకు బాల్యవివాహంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండే వరకు పెళ్లి చేయమని లిఖితపూర్వకంగా హామీ తీసుకుని బాలికను అప్పగించారు.

ఈనెల 14న ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఓ 16 ఏళ్ల బాలికకు 27 ఏళ్ల యువకుడితో వివాహం చేస్తున్నారని 1098 నంబర్‌కు రెండురోజుల ముందే సమాచారం వచ్చింది. జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు వెళ్లి అమ్మాయి కుటుంబసభ్యులతో మాట్లాడారు. అనంతరం సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచి అమ్మాయి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 ఏళ్లు నిండే వరకు పెళ్లి చేయమని లిఖితపూర్వక హామీ ఇవ్వడంతో బాలికను వారితో పంపించారు.

బాల్యానికి బంధం



బాల్యం వివాహ బంధంలో బందీ అవుతోంది.. మూడుముళ్లతో ముక్కు పచ్చలారని బాలికల జీవితాన్ని ముడిపెడుతున్నారు. ఈ పరిస్థితిని నిరోధించడానికి చట్టాలు ఉన్నా.. అవగాహనా రాహిత్యంతో కొందరు.. ఆర్థిక సమస్యలతో మరికొందరు బాల్య వివాహాలు చేస్తూ వారి బంగారు భవిష్యత్‌ను బుగ్గి చేస్తున్నారు.

పెరుగుతున్న బాల్య వివాహాలు

- 2023లో 102.. ఈ ఏడాది ఏకంగా 140
- అధికారులు ఆపినవి ఇవే అయితే.. అనధికారికంగా అనేకం ఉన్నాయి
- ఏటికేడు పెరుగుతుండడంతో అధికారుల్లో ఆందోళన
- తల్లిదండ్రుల్లో మార్పుతోనే అరికట్టే అవకాశం

అధికారులు ఆపిన బాల్య వివాహాల కేసుల వివరాలు

జిల్లా	2023	2024
వరంగల్	18	7
హనుమకొండ	10	43
జయశంకర్	9	18
జనగామ	14	13
ములుగు	15	9
మహబూబాబాద్	36	50

సాక్షి, వరంగల్ :

ఆధునిక సాంకేతికత ఎంతో పెరిగింది. సమాజంలో పెనుమార్పులు వచ్చాయి. అయినా బాల్యవివాహాలు ఆగడం లేదు. ఆడపిల్లలు చదువులో రాణిస్తూ అన్నిరంగాల్లో దూసుకుపోయి సత్తా చాటుతున్నా ఇంకా పలుచోట్ల బలవంతపు వివాహాలు చేస్తూ బలి చేస్తూనే ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికీ తరచూ బాల్యవివాహాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ ఆరు జిల్లాల్లో 2023 సంవత్సరం 102 బాల్యవివాహాలను అధికారులు అడ్డుకోగా.. ఈ ఏడాది ఏకంగా 140 వరకు నిరోధించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంకా వెలుగులోకి రానివి అనేకం ఉన్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం.. 18 ఏళ్లలోపు బాలికలు 26.8 శాతం మంది, 21 ఏళ్లలోపు బాలురు 20.3 శాతం మంది బాల్యవివాహాల బారిన పడుతున్నట్లు పేర్కొనడం ఆందోళన కలిగిస్తోంది.

ఆ కుటుంబాల్లోనే ఎక్కువ..

తల్లిదండ్రుల్లో ఒకరు చనిపోయినప్పుడు బాలికలను భారంగా భావిస్తున్నారు. 14 నుంచి 18 ఏళ్లలోపు వారిని పెళ్లి పీటలెక్కిస్తున్నారు. తాజాగా నమోదైన కేసుల్లో అమ్మాయిలు బడికెళ్లి చదువుకుంటుండగానే మధ్యలో ఆపి మెడలో పసుపుతాడు వేసేందుకు పట్టుబడుతున్నారు. తండ్రి చనిపోయాడని, పేదరికం పట్టి పీడిస్తోందని, అందుకే అమ్మాయిల భారం దించేసుకోవాలని బాల్యవివాహాలు చేస్తున్నారు. ఇది నిరక్షరాస్యులైన కుటుంబాల్లోనే ఎక్కువగా కనిపిస్తోందని వచ్చిన కేసులను అధికారులు పరిశీలిస్తే తెలుస్తోంది. తమ కులంలో ఆడబిడ్డలకు త్వరగా పెళ్లి చేయడమే సంప్రదాయమని చెబుతూ మైనర్లుగా ఉన్నప్పుడు మనువు కానిచ్చేస్తున్న కుటుంబాలు కూడా ఉన్నాయి.

ఆరోగ్యపరంగా చాలా నష్టం..



పెళ్లి వయస్సు రాకుండా వివాహం చేయడం వల్ల అమ్మాయిలైనా, అబ్బాయిలైనా చాలా కష్టనష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మానసిక, శారీరక పరిపక్వత లేకపోవడం మూలంగా అనేక సమస్యలు తలెత్తుతాయి. స్వతహాగా ఎదుర్కోలేక మానసికంగా కుంగిపోతారు. చిన్న వయస్సులో బాలికలకు గర్భ సంచి ఎదగదు. ఇలాంటి పరిస్థితుల్లో గర్భం దాలిస్తే గర్భస్రావం జరిగే అవకాశం ఉంటుంది. పుట్టిన పిల్లలు కూడా బరువు తక్కువగా, తరచూ అనారోగ్యం బారిన పడతారు. తల్లిదండ్రులు ఈ విషయంలో పొరపాటు చేయవద్దు.

-డాక్టర్ నరేశ్ కుమార్, రాష్ట్ర వైద్యమండలి సభ్యుడు

వివాహ నమోదు తప్పనిసరి చేయాలి..



జనన, మరణ తేదీల నమోదు మాదిరిగానే వధూవరుల వయసు, పాఠశాల, ఆస్పత్రి రికార్డులను పరిశీలించి మేజరైతేనే ముహూర్తం పెట్టేలా బ్రాహ్మణులు చర్యలు తీసుకోవాలి. పెళ్లి నమోదు రికార్డులను సంబంధిత అధికారులకు అప్పగించేలా చూస్తే చాలావరకు బాల్యవివాహాలను కట్టడి చేయవచ్చు. గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ప్రతిఒక్కరూ వీటిని నిరోధించేందుకు కృషి చేయాలి. బాల్యవివాహం జరిపితే రెండేళ్ల జైలు శిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమానా లేదంటే రెండూ ఒకేసారి విధించే వీలుంది.

-మండల పరశురాం, సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్, ఉమ్మడి వరంగల్

1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వండి..



వివాహ వయసు అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలుగా ప్రభుత్వం నిర్దేశించింది. చాలావరకు బాల్య వివాహాలు గ్రామీణ ప్రాంతాల్లోనే జరుగుతున్నాయి. వీటిని నిరోధించడానికి 1098 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. అధికారులు ఆపిన బాల్యవివాహాల్లో ఎక్కువగా ఈ నంబర్‌కు అందిన ఫిర్యాదుల వల్లే. ఫోన్ చేసిన వారి పేరు, నంబర్ వెల్లడించే అవకాశం లేకపోవడంతో ఎవరైనా నిర్భయంగా సమాచారం అందించవచ్చు.

-బి.రాజమణి, వరంగల్ జిల్లా సంక్షేమ అధికారి

ఆరో వార్డుకు తాగునీటి సరఫరా

శాయంపేట : మండల కేంద్రంలోని ఆరో వార్డుకు తాగునీటిని సరఫరా చేశారు. ఈ వార్డులో మూడు నెలలుగా తాగునీటి కొరత తలెత్తడంతో మహిళలు గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈనేపథ్యంలో 'తాగునీటి కోసం మహిళల నిరసన' శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు రూ.40వేల విలువైన మోటారు పంపింగ్ సెట్టు కొనుగోలు చేశారు. ఎంపీఓ రంజిత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో పంపు ఆపరేటర్‌తో మోటారు బిగించి తాగునీటిని సరఫరా చేశారు.



బోరుకు మోటారును బిగిస్తున్న పంపు ఆపరేటర్

ముగిసిన ఏఎన్‌ఎంల ఆందోళన

ఎంజీఎం: వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఏఎన్‌ఎంల 48 గంటల నిరసన రెండో రోజు శుక్రవారం కొనసాగింది. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట వారు రాత పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను దహనం చేసి నిరసన తెలిపారు. 24 ఏళ్లుగా పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు యాదానాయక్ శ్రీనివాస్, సుజాత, చంద్రకళ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



హాల్ టికెట్లు దహనం చేసి నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

వైద్య సేవలు వినియోగించుకోవాలి



పేషెంట్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

ఎంజీఎం/ఎల్కతుర్తి: ప్రభుత్వాస్పత్రుల్లో అందించే వైద్య సేవలను వినియోగించుకోవాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య అన్నారు. శుక్రవారం గోపాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రెండుసార్లు జాతీయ నాణ్యతా ప్రమాణాల గుర్తింపునకు ఎంపికైందని తెలుసుకుని వైద్యాధికారిని అభినందించారు. అనంతరం ఆస్పత్రిలోని రిజిస్టర్లు, ల్యాబ్, ఫార్మసీ, వార్డు రూమ్స్, థియేటర్‌ను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం కొంత మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. జిల్లాలో హైపర్‌టెన్షన్ 822, డయాబెటిస్ 448, కేన్సర్ ఇద్దరు.. వ్యాధిగ్రస్తులందరికీ ఉచిత వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయేందర్ రెడ్డి, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ ఈశ్వర్ ప్రసాద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంపై కేసు నమోదు చేయాలి

బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో రాష్ట్రం పరువు తీసిన సీఎం రేవంత్‌రెడ్డిపైనే కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకులతో మాట్లాడుతూ.. ఫార్ములా–ఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చించాలని కోరితే సీఎం ముఖం చాటేస్తున్నాడని విమర్శించారు. ప్రభుత్వ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కుట్రలకు పాల్పడి అక్రమ కేసులు పెట్టి అరెస్టులకు పూనుకుందని ధ్వజమెత్తారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవ రెడ్డి, పులి రజనీకాంత్, నయీముద్దీన్, జనార్దన్ గౌడ్, ఎల్లావుల లలితాయాదవ్, అశోక్, విక్టర్ బాబు, రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధానంపై అవగాహన అవసరం

ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి

కేయూ క్యాంపస్: ఎన్నికల నిర్వహణ విధానంపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి అన్నారు. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అనే అంశంపై శుక్రవారం కళాశాలలోని సామాజిక శాస్త్రాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. భారతదేశం పెద్ద ప్రజాస్వామిక వ్యవస్థ.. గడిచిన 75 ఏళ్లలో ఎన్నికల నిర్వహణలో అనేక సంస్కరణలు వచ్చాయి.. ప్రాంతీయ, జాతీయ అనే రెండు విధాలుగా ఎన్నికలు నిర్వహించారు.. నేడు ఒకే దేశం ఒకే ఎన్నిక అనే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చిందన్నారు. రాజనీతిశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సంజీవ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లారమేష్, అధ్యాపకులు కరుణాకర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చ

హన్మకొండ: ఫోరం ఫర్ బెటర్ వరంగల్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉమ్మడి వరంగల్ జిల్లా, వరంగల్ నగర సమగ్రాభివృద్ధిపై మేధావులచే చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్‌లోని మేధావులు, సమస్యలపై అవగాహన ఉన్న ప్రతినిధులు పాల్గొని తమ సమాచారమందించాలని కోరారు.

ఉత్సాహంగా కొనసాగిన సీఎం కప్ పోటీలు



వరంగల్: జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో భాగంగా శుక్రవారం ఓసీటీ క్రీడామైదానంలో నిర్వహించిన వివిధ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ క్రీడా పోటీల్లో దాదాపు 680 మంది పాల్గొన్నట్లు డిప్యూటీ ఎస్ఓ సత్యవాణి తెలిపారు. ఇందులో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ రఘువీర్, వైస్ ప్రెసిడెంట్ పాక శ్రీను, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాష్ యాదవ్, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు లింగమూర్తి, జూడో కోచ్‌లు కుమారస్వామి, సుమన్, క్రికెట్ కోచ్ అనిల్‌కుమార్, సిబ్బంది మౌనిక, రమేశ్, రాజేందర్, అహ్మద్ పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలకు శనివారం ఓసీటీ క్రీడామైదానంలో బహుమతులు అందజేయనున్నట్లు డిప్యూటీ ఎస్ఓ తెలిపారు.

క్రీడాకారులకు వైద్యసేవలు

వరంగల్: జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడాకారులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వరంగల్ డీఎంహెచ్ఓ సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఓసిటీ క్రీడామైదానంలో వైద్య సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం శిబిరంలో వైద్యాధికారులు క్రాంతి, దివ్య, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఆరోగ్య కార్యకర్త జ్యోతి, ఆశ కార్యకర్తలు స్వరూప, రజిత అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో జైలు

కాటారం: మహాముత్తారం మండలం కొర్లకుంటలో 2018లో చోటుచేసుకున్న హత్యాయత్నం కేసులో అదే గ్రామానికి చెందిన నిందితుడు మేడిపల్లి నరేశ్‌కు జైలు శిక్ష విధిస్తూ భూపాలపల్లి జిల్లా కోర్టు అసిస్టెంట్ సెషన్ జడ్జి జయరామిరెడ్డి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కొర్లకుంటకు చెందిన కాల్వ రాజేశ్ అదే గ్రామానికి చెందిన మేడిపల్లి నరేశ్‌పై 2018లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై రాజు నరేశ్‌పై కేసు నమోదు చేయగా కోర్టులో కొనసాగుతుంది. ఇదే క్రమంలో శుక్రవారం కేసు ట్రయల్‌కు రాగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఫి ఆధ్వర్యంలో ఎస్సై మహేందర్‌కుమార్, కోర్టు లైసింగ్ ఆఫీసర్ వెంకన్న, కోర్టు పీసీ సంపత్‌రెడ్డి సాక్షులను కోర్టు ఎదుట ప్రవేశపెట్టారు. దీంతో నేర నిరూపణ కావడంతో జడ్జి.. నిందితుడు నరేశ్‌కు రెండేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు.



నిర్వహణాధికారులు ఎక్కడ?

ఏళ్లు గడుస్తున్నా మేడారంలో ఏర్పాటు కానీ ఈఓ ఆఫీస్
- మంత్రులు, ఉన్నతాధికారుల పర్యటనల సమయంలోనే వస్తున్న ఈఓ
- అసహనం వ్యక్తం చేస్తున్న ఆదివాసీ పూజారులు
- వరంగల్ ధార్మిక భవనంలో కొనసాగుతున్న ఈఓ కార్యాలయం


వరంగల్‌లోని ధార్మిక భవనం

ఎస్ఎస్‌తాడ్వాయి: లక్షలాది మంది భక్తులు వచ్చే సమ్మక్క, సారలమ్మ జాతర, మేడారం అభివృద్ధి విషయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ వైఖరిపై సమ్మక్క, సారలమ్మ పూజారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులంతా హనుమకొండలోనే ఉంటూ మేడారాన్ని పట్టించుకోవడం లేదంటున్నారు. ఇక్కడ జరిగే అభివృద్ధిలో తమ అభిప్రాయాలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మేడారానికి మంత్రులు, జిల్లా కలెక్టర్ వస్తేనే అధికారులు మేడారానికి వస్తున్నారని.. ప్రధానంగా కార్యనిర్వహణాధికారి కార్యాలయం మేడారంలో లేకపోవడంతో ఈఓ చుట్టపుచూపుగా ఇక్కడకు వస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

మోకాలడ్డు?

ప్రస్తుతం మేడారం ఈఓగా ఉన్న రాజేంద్రం వరంగల్‌లోని ధార్మిక భవన్ కేంద్రంగా విధులు నిర్వర్తిస్తున్నారు. మేడారంలో దేవాదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించి అతిథి సముదాయ నిర్మాణానికి రూ.2.15 కోట్లను 2022 జాతర సందర్భంగా మంజూరు చేశారు. ఈ నిర్మాణం పూర్తయితే ఇందులో ఈఓ ఆఫీసు నిర్వహణకు ఆస్కారం ఉండేంది. కానీ, మూడేళ్లు గడిచినా నిర్మాణ పనులు మొదలే కాలేదు. మరోవైపు ఇక్కడ మొదలు పెట్టిన రెవెన్యూ, ఆర్ అండ్ బీ అతిథి, ఆర్ డబ్ల్యూఎస్ అతిథి గృహాలు పూర్తయ్యాయి. అయితే మేడారంలో ఉంటూ విధులు నిర్వహించడం ఇష్టంలేకనే సంబంధిత అధికారులే పనులు అడ్డుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

1996లో రాష్ట్ర పండుగగా గుర్తింపు

లక్షలాదిగా భక్తులు తరలివచ్చే మేడారం జాతర 1996లో దేవాదాయశాఖ పరిధిలోకి వెళ్లగా.. ఈ ఏడాది రాష్ట్ర పండుగగా గుర్తించారు. గద్దెల ప్రాంగణం పక్కన ఉన్న రేకుల గదుల్లో ఉంటూ ఈఓ సహా ఇతర సిబ్బంది జాతర సమయంలో సేవలు అందించేవారు. ఇటీవల దాన్ని కూల్చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మేడారంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని కాటేజీల్లో ఈఓ ఆఫీసు ఏర్పాటు చేసి, 2016 జాతర సందర్భంగా ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహించారు. జాతర ముగిసిన తర్వాత మళ్లీ ఈఓ కార్యకలాపాలను హనుమకొండ నుంచే కొనసాగించారు. 2018 జాతర నాటికి అప్పటి సీఎం కేసీఆర్ మేడారం అభివృద్ధికి రూ.200 కోట్ల నిధులతోపాటు 200 ఎకరాల స్థలాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖకు అప్పగిస్తామని ప్రకటించారు. కానీ, ఈ రెండు హామీలు అమలుకు నోచుకోలేదు. మరోవైపు తాత్కాలికంగా కొనసాగిన ఈఓ కార్యాలయం కూడా ఇక్కడి నుంచి దూరమైంది. కొన్ని సంవత్సరాలు హనుమకొండలోని అద్దె భవనంలో ఈఓ కార్యాలయాన్ని కొనసాగించారు. అనంతరం వరంగల్‌లో శాశ్వత ధార్మిక భవనం నిర్మించడంతో మేడారం ఈఓ కార్యాలయాన్ని అక్కడకు తరలించారు.

ఇన్‌చార్జ్ పాలనే..

మేడారం జాతర దేవాదాయశాఖ పరిధిలోకి వచ్చి 30 ఏళ్లు అవుతున్నా.. ఇప్పటికీ మేడారం జాతరకు పూర్తిస్థాయి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈఓ)ను నియమించకపోవడం గమనార్హం. ప్రతీసారి జాతర సందర్భంగా ఇతర ఆలయాల్లో సూపరింటెండెంట్ హోదా అధికారిని తాత్కాలిక ఈఓగా నియమిస్తున్నారు. ఆ తర్వాత మేడారం జాతరను పట్టించుకోవడం లేదు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత మేడారంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రెండేళ్లకోసారి ఇక్కడ భక్తులు కనిపించే దశ నుంచి ప్రతి బుధవారం నుంచి ఆదివారం వరకు సగటున వెయ్యి మంది భక్తులు వచ్చే స్థితికి చేరుకుంది. వందల సంఖ్యలో ప్రైవేట్ కాటేజీలు, షాపింగ్ కాంప్లెక్స్ వెలిశాయి. అయితే వీరిని పట్టించుకునే వారు దేవాదాయశాఖ తరఫున ఇక్కడ ఎవరూ లేకపోవడం గమనార్హం.

ఈఓ ఆఫీస్ ఏర్పాటుపై నిర్లక్ష్యం



మేడారంలో ఈఓ ఆఫీస్ ఏర్పాటు చేయడంలో దేవాదాయశాఖ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. అధికారుల అవసరాల నిమిత్తం సిటీ వాతావరణానికి అలవాటు పడి మేడారంలో కార్యాలయం ఏర్పాటు చేయడం లేదు. చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మేడారంలో ఈఓ కార్యాలయం ఏర్పాటుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

– సిద్ధబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

మేడారంలో ఈఓ కార్యాలయం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. భక్తులకు అందుబాటులో ఉండి సేవలందిస్తాం.

– సునీత, అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయశాఖ

నేరాలకు పాల్పడితే చర్యలు

- సెంట్రల్‌జోన్ డీసీపీ షేక్ సలీమా


కార్డన్ సెర్చ్‌లో మాట్లాడుతున్న డీసీపీ సలీమా

వరంగల్ క్రైం: నగరంలో నేరాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని హనుమకొండ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా అన్నారు. శుక్రవారం హనుమకొండ (సుబేదారి) హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఏపీపీ దేవేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, సైబర్ క్రైమ్ అధికారులతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీల్లో పలు ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రహదారులపై వాహనాలను తనిఖీ చేసి వాహన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. మైనర్ బాలురు వాహనాలు నడపడం, నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు డ్రగ్స్, గంజాయి ఇతర నేరాలు జరుగుతున్నాయని అన్నారు. సరైన పత్రాలు లేని 20 ద్విచక్రవాహనాలు, 6 ఆటోలు సీజ్ చేశామని తెలిపారు. కాలనీలో అనుమానాస్పదంగా ఎవరైన వ్యక్తులు కనిపిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, హనుమకొండ, యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్లు సతీష్, రవికుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్లు 10మంది, 100 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కొత్త డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్


ఏనుమాముల మార్కెట్ వద్ద ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్, బీఆర్ఎస్ నాయకులు

వరంగల్: కొత్త మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ రద్దు చేసి పాత మాస్టర్‌ప్లాన్–2041 అమలు చేయాలని తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ ఏనుమాముల మార్కెట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వ కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఏనుమాముల మార్కెట్ ప్రజలకు అన్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. విధానాలను మార్చుకోకపోతే ప్రజలు తిరగబడే రోజులు వస్తాయని హెచ్చరించారు. కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, ఎల్లావుల లలితాయాదవ్, జిల్లా నాయకులు కేతిరి రాజశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.రమేశ్ బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, 14వ డివిజన్ నాయకులు పత్రి రాజపోశాలు తదితరులు పాల్గొన్నారు.

భర్త చేతిలో భార్య హతం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మడికొండ: కట్టుకున్న భర్తే కాయముడై ఉరి వేసి చంపిన ఘటన కాజీపేట మండలం అమ్మవారిపేట గ్రామంలో చోటు చేసుకుంది. మడికొండ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం అమ్మవారిపేట గ్రామానికి చెందిన మైదం కొంరయ్య కొద్ది రోజులుగా పని చేయకపోగా తాగుడుకు బానిసై భార్య మైదం సంతోష(55), కుమారుడు రాజేశ్‌తో గొడవ పడుతూ చంపుతానని బెదించేవాడు. ఈక్రమంలో గ్రామంలో కుల పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. పంచాయితీలో పెద్దమనుషులు కుటుంబ సభ్యులు, కొంరయ్యను మందలించి పంపించారు. ఈక్రమంలో గురువారం ఇంట్లో ఉన్న సంతోషతో గొడవ పడి తాడుతో గొంతుకు బిగించి హత్య చేశాడు. కోడలు చూసి కేకలు వేయడంతో కొంరయ్య పారిపోయాడు. శుక్రవారం కుమారుడు రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

వ్యాపారులపై కేసు నమోదు

వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డితో పాటు మరి కొందరు వ్యాపారులపై కేసు నమోదైనట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. లక్ష్మీటాకీస్ సమీపాన ఒక భవనంలో అద్దెకు ఉంటున్న టిఫిన్ సెంటర్ నిర్వాహకులను యజమానితో కలసి వీరు బెదిరించినట్లు ఈనెల 18వ తేదీన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే.. ఈ విషయం తెలిసిన చాంబర్ అధ్యక్షుడు మరికొంత మందితో కలసి వరంగల్ ఏసీపీ వద్దకు వెళ్లి ఆయన ఎదుట కూర్చోవడంతో ×నీపై కేసు నమోదైంది.. నాముందు ఎలా కూర్చుంటావు₹ అని అధికారి అనడంతో మనస్థాపానికి గురైన ఆయన తోటి వ్యాపారులతో కలసి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు దృష్టికి తీసుకుపోగా ఇరువర్గాలను సముదాయించినట్లు సమాచారం.

అరవింద్ ఆర్యపకిడేకు ‘చేంజ్ మేకర్’ అవార్డు ప్రదానం


అవార్డు ప్రదానం చేస్తున్న సినీ హీరోయిన్ రెజీనా

హన్మకొండ కల్చరల్: చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణకు కృషి చేస్తున్నందుకు వరంగల్ నగరానికి చెందిన టార్చ్ సంస్థ వ్యవస్థాపకులు అరవింద్ ఆర్యపకిడే ‘చేంజ్ మేకర్’ అవార్డు అందుకున్నారు. రేస్ టూ విన్ ఫౌండేషన్, డెమోక్రటిక్ సంఘ్ సంయుక్త ఆధ్వర్యంలో సమాజంలో మార్పు కోసం పాటు పడిన వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు, సంస్థలను గుర్తించి శుక్రవారం హైదరాబాద్‌లోని తాజ్‌ఫలక్‌నుమా ప్యాలెస్‌లో చేంజ్ మేకర్ అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా ఎంపీ జి.రేణుకాచౌదరి, గౌరవ అతిథులుగా మిస్‌యూనివర్స్ 1994 సుస్మితాసేన్, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ పాల్గొన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త, సామాజికవేత్త స్వామి అగ్నివేష్‌కు నివాళులర్పించారు. అనంతరం డెమోక్రటిక్ సంఘ్ వ్యవస్థాపకురాలు, సినీ హీరోయిన్ రెజీనా.. అరవింద్ ఆర్యపకిడేకు చేంజ్ మేకర్ అవార్డు ప్రదానం చేశారు.

డీసీఎం, లారీ డ్రైవర్ల మధ్య లొల్లి


నిరసన తెలుపుతున్న డీసీఎం యజమానులు, డ్రైవర్లు

వరంగల్ చౌరస్తా: వరంగల్ లోకోషెడ్ నుంచి ఫెర్టిలైజర్స్ దిగుమతుల విషయంలో కొద్ది నెలలుగా డీసీఎం, లారీ డ్రైవర్ల మధ్య వివాదం నెలకొంది. దీంతో శుక్రవారం డీసీఎం యజమానులు, డ్రైవర్లు వరంగల్ పాత అజాంజాహి మిల్లు గ్రౌండ్‌లో నిరసన వ్యక్తం చేశారు. అయితే ఓ రాజకీయ నాయకుడి ప్రమేయం వల్లనే సమస్య జఠిలమై ఓ యూనియన్ రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి


సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆరెపల్లి మోహన్ ఆధ్వర్యాన సీఎండీని కలిశారు. ఈ సందర్భంగా సమస్యలను సీఎండీకి వివరించి పరిష్కరించాలని కోరగా.. సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి బి.దానయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఉపేందర్, ఉపాధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి తౌర్య, తదితరులు పాల్గొన్నారు.

టీజీబీగా ఏపీజీవీబీ బ్రాంచ్‌లు

- 2025 జనవరి 1 నుంచి సేవలు
- బ్యాంకు చైర్మన్ కె.ప్రతాప్ రెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి

హన్మకొండ: రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ బ్రాంచ్‌లు ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకులు(టీజీబీ)గా పని చేస్తాయి.. 2025 జనవరి 1 నుంచి పూర్తి స్థాయి సేవలు అందుబాటులో ఉంటాయని ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రతాప్ రెడ్డి చెప్పారు. శుక్రవారం హనుమకొండలోని బ్యాంకు వరంగల్ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలోని 493 ఏపీజీవీబీ బ్రాంచీలు టీజీబీలో విలీనమవుతున్న క్రమంలో ఈనెల 28 నుంచి 31 వరకు బ్యాంకు సేవలు పూర్తిగా నిలిచిపోతాయన్నారు. ఈ నాలుగు రోజుల పాటు సేవల అంతరాయానికి చింతిస్తున్నామని, ఖాతాదారుల నంబర్లు మారవని, చెక్కు బుక్కులు, పాస్ బుక్కులు కొత్తవి ఉచితంగానే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకు సేవల నిలిపివేతపై బ్యాంక్ వెబ్‌సైట్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాతో పాటు ఖాతాదారులకు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం చేరవేసినట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఏపీజీవీబీ జనరల్ మేనేజర్ ఆపరేషన్ బి.దయాకర్, రీజినల్ మేనేజర్ జి.పి.ఎస్.చైతన్య కుమార్, చీఫ్ మేనేజర్ యశ్వంత్, మేనేజర్ (ఆపరేషన్) కె.వెంకటచారి పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు సంక్షేమ పథకాలు

- హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి జయంతి



వృద్ధురాలికి దుప్పటి అందజేస్తున్న అదనపు డీసీపీ రవి

హన్మకొండ: వృద్ధులు, దివ్యాంగులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి జయంతి అన్నారు. హనుమకొండ సుబేదారిలోని వనం కార్యాలయంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి, వనం మహిళా సంఘం ఆధ్వర్యాన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల సంఘీభావం దినాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 400 మంది వృద్ధులకు దుప్పట్లు, ఇతర సామగ్రి అందజేశారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ ఎం.రవి మాట్లాడుతూ.. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ధైర్యంగా ఉండాలని, వారి రక్షణకు పోలీస్ శాఖ తోడ్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో యాంటీ ఉమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, వనం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిస్టర్ నిర్మల, సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, హనుమకొండ జిల్లా బాలల సంక్షేమ అధికారి ఎస్.ప్రవీణ్ కుమార్, బాలరక్ష భవన్ కోఆర్డినేటర్ అవంతిక తదితరులు పాల్గొన్నారు.

‘నిఫ్ట్’లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


నిఫ్ట్ అడ్మిషన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు చక్రపాణి, శ్రీనివాస్

నయీంనగర్ : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్)–2025 ప్రవేశాలకు ఆన్‌లైన్ నిఫ్ట్ వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ ప్రొఫెసర్ చక్రపాణి, డాక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో వారు అడ్మిషన్ క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ నిఫ్ట్‌లో జూలై–2025 గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశాలు పొందేందుకు అభ్యర్థులు www.nif-t.ac.in /admirrion లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ఫ్యాషన్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, యాక్సెసరీ డిజైన్, నిట్‌వేర్ డిజైన్, లెథర్ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ టెక్నాలజీ–10+2 ఏదైనా స్ట్రీం విద్యార్థులు గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 040 23112628, 94412 36043 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నరేష్ పాల్గొన్నారు.

ఏబీవీపీ కేయూ నూతన కమిటీ ఎన్నిక

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన ఏబీవీపీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఏబీవీపీ నూతన కమిటీని వరంగల్ విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ ఏలేటి నాగరాజు శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా మెరుగు సాయికుమార్, కార్యదర్శిగా చింతకాయల శివ, ఉపాధ్యక్షులుగా అఖిల్, శివ, రోహిత్, కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా వంశీ, ఫణీంద్ర, మహేశ్, శివకుమార్, ప్రణయ్, సందీప్, గర్ల్స్ కన్వీనర్‌గా పి.పూజను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. మరో 10 మంది కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. సమావేశంలో ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధకుడు జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 9న కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు

ఎంజీఎం: కెమిస్ట్, డ్రగ్గిస్ట్ వరంగల్ జిల్లా అసోసియేషన్‌కు ఎన్నికలు ఫిబ్రవరి 9న నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు మృత్యుంజయరెడ్డి, శ్రీరామ్ రాములు తెలిపారు. నూతన సభ్యత్వం కోసం ఈ నెల 31 వరకు గడువు విధించినట్లు పేర్కొన్నారు. కొత్త సభ్యులు అసోసియేషన్‌లో చేరేందుకు రూ.1,000 చెల్లించాలని, పాత సభ్యులు రెన్యువల్ కోసం రూ.500 చెల్లించాలని కోరారు. నామినేషన్ దరఖాస్తులు జనవరి 17 నుంచి 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 18వ తేదీన సాయంత్రం వరకు నామినేషన్లు స్వీకరణ, 19వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో సభ్యుడు ఒక్క పదవికి మాత్రమే పోటీకి అర్హులని తెలిపారు.

డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని హత్య?

- కాటారం మండలం అంకుషాపూర్‌లో ఘటన
- వివాహేతర సంబంధమే కారణం..?


శైలజ మృతదేహం

కాటారం: భర్తతో విడిపోయి ఉంటున్న మహిళతో వివాహేతర సంబంధం నెరపుతున్నాడు ఓ వ్యక్తి.. ఆ తర్వాత ఇద్దరి మధ్య గొడవలు జరగడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ చేసుకొని రూ.40 వేలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. కానీ, పైసలు ఇవ్వకుండా ఉండేందుకు ఆ మహిళను హత్య చేశాడు ఆ వ్యక్తి. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి, పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలం కమలాపూర్‌కు చెందిన కాల్వ శైలజ(30) అనే మహిళ.. భర్తతో విడిపోయి ఐదేళ్లుగా తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. తన అక్క, చెల్లి అత్తగారి గ్రామమైన కాటారం మండలంలోని అంకుషాపూర్‌కు అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంది. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన ఇనుగాల రమేశ్‌తో పరిచయం ఏర్పడి అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఇది రమేశ్ భార్యకు తెలియడంతో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. దీంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరగగా రమేశ్, శైలజకు రూ.40 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ఒప్పుకున్న విధంగా రమేశ్, శైలజకు డబ్బులు ఇవ్వకపోగా ఇంటికి వచ్చి బెదిరింపులకు గురి చేయడంతో భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో రమేశ్ ఈ నెల 17న శైలజ ఇంటికి వచ్చి రాజీ పడాలని బ్రతిమిలాడటంతో ఆమె ఒప్పుకుంది. అనంతరం రమేశ్ వెళ్లిపోగా శైలజ సైతం భూపాలపల్లికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలినవారి వద్ద ఆరా తీసి చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, అంకుషాపూర్ శివారులోని అటవీప్రాంతంలో శుక్రవారం ఓ మహిళ మృతదేహం కన్పించడంతో శైలజ అని గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మూడు రోజుల క్రితం గొంతు నులిమి హత్య చేసినట్లు ఆనవాళ్లు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, క్లూస్ టీం ఎస్సై రాజ్‌కుమార్ పరిశీలించారు. హత్య స్థలంలో పలు వివరాలు సేకరించారు. రూ.40 వేలు ఇవ్వాల్సి వస్తుందని రమేశ్ తన కూతురికి మాయమాటలు చెప్పి అడవిలోకి తీసుకొచ్చి హత్య చేశాడని శైలజ తల్లి దుర్గమ్మ పేర్కొంది. దుర్గమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేశ్‌పై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

24న అంపశయ్య నవీన్ గ్రంథాల ఆవిష్కరణ

విద్యారణ్యపురి: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ జన్మదినం సందర్భంగా నవీన్ లిటరరీ ట్రస్టు ఆధ్వర్యాన ఈనెల 24న సాయంత్రం 5.30 గంటలకు హనుమకొండ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో అంపశయ్య నవీన్ గ్రంథాలను ఆవిష్కరించనున్నారు. అలాగే ప్రథమ నవలా పురస్కారాలు కూడా అందజేయనున్నట్లు అంపశయ్య నవీన్ ట్రస్టు సెక్రటరీ డి.స్వప్న శుక్రవారం తెలిపారు. ‘ప్రేమకు ఆవలి తీరం’ నవలకు ఇంగ్లిష్ అనువాదం(బియాండ్ ది షోర్‌ఆఫ్ లవ్) గ్రంథాన్ని ప్రొఫెసర్ మిట్టపెల్లి రాజేశ్వర్, కర్రె సదాశివ్ రచించిన అంపశయ్యనవీన్ కథలు–ఒక పరిశీలన గ్రంథాన్ని జి.గిరిజామనోహర్‌బాబు ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.